శ్రీ శుభదుర్గ వ్రతం

సాక్షాత్తూ జగన్మాతచే అనుగ్రహింపబడిన అద్భుతవ్రతం



విశ్వపతి



యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణసంస్థితా।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః।

శ్రీ శుభదుర్గ వ్రతం

(సాక్షాత్తూ జగన్మాతచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతం)



విశ్వపతి

(తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి)

श्रीं

శ్రీ డిజైన్స్

VEDIC LOGO DESIGNERS

www.lordofsevenhills.com

Phone : 040 - 23833752

హైదరాబాదు

2015

శ్రీ శుభదుర్గ వ్రతం

(సాక్షాత్తూ జగన్మాతచే అనుగ్రహింపబడిన అద్భుత వ్రతం)

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

First Edition : 2015

వెల : రూ. 20/-

Designed & Printed at :
Sri Vasavi printers,
1A, 1st Floor, Ameepet,
Hyderabad. 9989277178.

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి రచించిన వ్రత పుస్తకాలు
ఈ వెబ్‌సైట్‌ల నుంచి ప్రింట్ చేసుకొనవచ్చును.
www.lordofsevenhills.com
www.vratams.com

T.V.R.K. MURTHY, M.Tech
Flat No. 202, Plot No. 32, Srikar's Ravi Residency, Beside Nalanda High School, Near Motinagar 'X' Roads, HYDERABAD - 500 018, India.
Ph:040-23833752. Cell : 98494 43752
Email : viswapathi@yahoo.com, shridesigns@gmail.com

నివేదన

యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణసంస్థితా।
నమస్తస్యై నమస్తస్యై నమసస్యై నమో నమః।

జగన్మాత దయాహృదయురాలు. మనందరిని ఎంతో ఆప్యాయంగా చూసే తల్లి. ఆ తల్లి చల్లని చూపులతో లోకమంతా ఎటువంటి ఆపదలూ జరగకుండా శుభప్రదంగా నడుస్తుంటుంది. జగన్మాత త్రిమూర్తులకు మూలమైన పరబ్రహ్మస్వరూపిణి. సృష్టిలోని దేవతలందరి శక్తులు ఆ తల్లి అనుగ్రహమే! ఎవరైతే జగన్మాతను నిత్యం కొలుస్తారో వారికి వేటికీ లోటుండదు. జీవితం శుభప్రదంగా గడుస్తుంది.

1983లో ఐజనల్ ఇంజనీరింగ్ కాలేజి, వరంగల్ నుండి ఎం.టెక్. చదివిన నేను 1984 దాకా ఆల్విన్‌లోనూ, 1989 దాకా ఎం.వి.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ కాలేజిలోనూ ఉద్యోగం చేశాను. 1983లో చి॥సౌ॥ వేంకట రుక్మిణి వైదేహితో వివాహం. ముగ్గురు పిల్లలు, ఆనంది, ఆముక్త, ఆదిత్యలు.

1998 నుంచి బిజినెస్ సంస్థలకు వేదశాస్త్రాలు, జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా పేర్లు నిర్ణయించటం, లోగోలు డిజైన్ చేయడంలో నిమగ్నమై ఉన్నాను. ఇప్పటిదాకా నేను లోగోలు డిజైన్ చేసిన 5,000 పైగా సంస్థలు దేశ, విదేశాలలో ప్రముఖ స్థానంలో ఉన్నాయంటే అదంతా ఆ శ్రీనివాసుని అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఆ శ్రీనివాసుని దయవలన నేను ఇప్పటిదాకా ఇరవైనాలుగు పుస్తకాలు రచించడం జరిగింది. వీటిలో పధ్నాలుగు ఆ శ్రీనివాసుని లీలా విశేషాలపైననే! ఈ పుస్తకాలన్నీ దేశ విదేశాలలోని భక్తులచేత నిత్యం పఠింపబడటం ఆ స్వామి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. ఈ పుస్తకాలు చదివిన ప్రతి వారికీ ఎన్నో శుభాలు జరుగుతున్నాయి. ఆ శ్రీనివాసుని అనుగ్రహంతో వీరందరూ ఎంతో సుఖంగా జీవిస్తున్నారు. ఈ రచనలన్నిటిలో శ్రీ వేంకటేశ్వర వ్రతకల్పం, శ్రీ లక్ష్మీ నరసింహ వ్రతకల్పం, శ్రీ ఆనంద ఆంజనేయం,
శ్రీ మహేశ్వర వ్రతం, శ్రీ సుబ్రహ్మణ్య వ్రతం, శ్రీ సాయిరక్షా వ్రతం, శ్రీరామరక్షావ్రతం,
శ్రీ జ్ఞాన సరస్వతీ వ్రతం భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. ఈ ఎనిమిది వ్రతాలు నిత్యం ఎందరో భక్తుల గృహాలలోను, ఎన్నో ఆలయాలలోను ఆచరింపబడుతున్నాయి. ఇంతకు మించిన భాగ్యం ఏముంటుంది?

ఎప్పటినుంచో కొందరు భక్తులు నన్ను జగన్మాతకు సంబంధించిన ఏదైనా తేలిక వ్రతవిధానం రచింపవలసిందిగా కోరుచున్నారు. కానీ భగవంతునికి సంబంధించిన ఏ పుస్తకమైనా ఆ దేవత కరుణ లేకపోతే సిద్ధించదు. రెండు సంవత్సరాల క్రితం నేను విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకున్నప్పుడు నాకు ఆ జగన్మాత అనుగ్రహం, ఆదేశం లభించింది. ఆ తల్లి కరుణా కటాక్షాలతో ఈ పుస్తకం ఇప్పటికి రాయగలిగాను. ఆచరించిన వెంటనే సమస్త శుభాలను అనుగ్రహించే ఈ శ్రీ శుభ దుర్గా వ్రతం ఆ చల్లని తల్లి అనుగ్రహం తప్ప మరొకటి కాదు. కలియుగంలో మనందరి శక్తిహీనత ఆ తల్లికి తెలుసును కాబట్టే దయామయురాలైన ఆ తల్లి మనందరికి ఎంతో తేలికైన ఈ వ్రతం అనుగ్రహించింది. ఈ వ్రతం చేసుకొనటం ఎంతో తేలిక. ఎవరైనా, ఎప్పుడైనా ఈ వ్రతం ఆచరించి ఆ తల్లి అనుగ్రహం పొందవచ్చును. శ్రీ శుభదుర్గాదేవిని ఆరాధించటంచేత తేజస్సు, యశస్సు, బుద్ధి, జ్ఞానము, వికాసము, కార్యసిద్ధి, శీఘ్రకళ్యాణం, సత్సంతాన ప్రాప్తి, పదోన్నతి, ఆరోగ్యము, అష్టైశ్వర్యములు లభిస్తాయి.

ఈ పుస్తకాన్ని చక్కగా డి.టి.పి. చేయించి అచ్చు వేయించిన శ్రీ వాసవీ ప్రింటర్స్ శ్రీమతి & శ్రీ పి.జగదీష్‌కు ఆ శ్రీ శుభదుర్గాదేవి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఈ పుస్తక ప్రథమ ముద్రణకి సహకరించిన ఎంతోమందికి నా కృతజ్ఞతలు. ముఖ్యంగా శ్రీ కాటంరెడ్డి శివకుమార్ రెడ్డి, శ్రీమతి గిరిజ గార్లకు (గౌతమి విద్యాధామం, యస్.ఆర్.నగర్, హైదరాబాద్) ఎన్నో కృతజ్ఞతలు. ఇదంతా కూడా కేవలం ఆ జగన్మాత ప్రేరణ అనుకుంటున్నాను. వీరికి, వీరి కుటుంబ సభ్యులందరికి ఆ తల్లి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తక రచనకు ప్రత్యక్షంగాను, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ వ్రతకల్పం ఆచరించిన మీకు, వ్రత కథలు విన్నవారికి, ప్రసాదం స్వీకరించినవారికి సకల ఆయురారోగ్య సౌభాగ్యాలు కలగాలని ఆ జగన్మాతను ప్రార్థిస్తున్నాను.

సర్వేజనా సుఖినోభవంతు ః
శ్రీ శుభదుర్గా కటాక్ష సిద్ధిరస్తు
సమస్త సన్మంగళానిభవంతు ః

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

Viswapathi@yahoo.com
shridesigns@gmail.com
Ph : 9849443752

Hyderabad
2015

ఈ వ్రతం ఎలా ఆచరించాలి?

- ఈ పుస్తకాన్ని ఎవ్వరైనా, ఎప్పుడైనా, వయసుతోగానీ, కులంతోగానీ నిమిత్తం లేకుండా పఠించవచ్చును. స్త్రీ, పురుష భేదం లేదు, ఏ నెలలోనైనా, ఏ రోజులలోనైనా చదువవచ్చును. ఈ వ్రతం ఆచరించే రోజున ఉపవాసం తప్పక ఉండాలనే నియమం లేదు.
- ఏ నెలలోనైనా, ఏ శుక్రవారంనాడైనా ఈ వ్రతం ఆచరింపవచ్చును. ముఖ్యంగా చైత్ర, వైశాఖ, శ్రావణ, ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర, మాఘ మాసములలో ఏ శుక్రవారం నాడు ఆచరించినా అత్యంత ఫలదాయకం. దశమి లేదా ఏకాదశి లేదా పౌర్ణమిలతో కూడిన శుక్రవారమైతే ఎంతో శ్రేష్టం. దసరా నవరాత్రులలో ఏ రోజునైనా ఆచరిస్తే ఎన్నో శుభాలు కలుగుతాయి. నవరాత్రులలో ప్రతిరోజు ఆచరించిన వారికి వేయి అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. ఈ వ్రతం ఆచరించే స్త్రీలు దీర్ఘసుమంగళీమణులుగా ఉంటారు. ఈ వ్రతం చేసే కన్యలకు చక్కటి వరులతో వెంటనే వివాహం నిశ్చయమౌతుంది. సంతానం లేనివారు చేసిన యెడల చక్కటి సంతానం కలుగుతుంది. అనారోగ్యంతో ఉన్నవారికి వెంటనే చక్కటి ఆరోగ్యం కలుగుతుంది. వ్యాపారంలో లాభం కలుగుతుంది. ఏ ఇంట ప్రతి శుక్రవారం దంపతులలో ఏ ఒక్కరైనా ఈ వ్రతం చేస్తూ ఉంటారో వారి ఇంట సర్వ సౌభాగ్యాలూ కలుగుతాయి. వారిల్లు ఎల్లప్పుడూ ధన ధాన్యాలతో సమృద్ధిగా ఉంటుంది. దేనికీ లోటుండదు.
- ఈ వ్రతం ఆచరించేముందు ఒక్కసారి మనస్సులోనే గణపతికి, నవగ్రహదేవతలకు, అష్టదిక్పాలకులకు నమస్కరించవలెను. అటుతరువాత మీ పేరు, మీ కుటుంబ సభ్యుల పేర్లు, గోత్రం మనస్సులో తలచుకొని వ్రతం మొదలుపెట్టవలెను. శ్రీ దుర్గా అష్టోత్తర నామాలు పఠించాలి. తరువాత ఈ పుస్తకంలోని ఐదు కథలను చదివి శ్రీ దుర్గా అమ్మవారికి ఏ ఫలమునైనా నివేదించవచ్చును.
- ఈ వ్రతం ఆచరించేరోజున ఉదయాన్నే లేచి స్నానం ఆచరించి తమ ఇంట్లోగల పూజా మందిరంలో కూర్చుని శ్రీ దుర్గామాత ఫోటో ఏదైనా ముందు ఉంచుకొనవలెను. మీ పూజామందిరంలో ఉన్న ఎడల ప్రత్యేకంగా వేరొకటి అవసరం లేదు. స్థలం సరిపోదు అనుకుంటే ఇంట్లో ఎక్కడైనా విశాల ప్రదేశంలో ముందుగా శుభ్రపరచి, ఆచరింపవచ్చును. తూర్పు, పడమర దిక్కులకు అభిముఖంగా కూర్చుని ఆచరింపవలెను.
- జగన్మాత ఆలయంలో ఈ వ్రతం ఆచరిస్తే ఎంతో ఫలప్రదం కాగలదు. పురుషులు కానీ, స్త్రీలు కానీ, ఇంటివద్ద కానీ, ఆలయంలో కానీ సామూహికంగా కూడా ఆచరింపవచ్చును. వ్రతం పూర్తి చేసిన తరువాత జగన్మాత శ్రీ శుభదుర్గాదేవికి

నైవేద్యంగా పాలు, చక్కెర, తేనె, రవ్వకేసరి, క్షీరాన్నం, పులిహోర, గారెలు, పండ్లు, వీటిలో వీలునిబట్టి ఏవైనా నివేదింపవచ్చును. శుక్రవారంనాడు ఆచరించేటప్పుడు క్షీరాన్నం, పులిహోర నివేదిస్తే విశిష్టం.

- పరీక్షలు వ్రాసే విద్యార్థులు ఈ వ్రతంలోని ఐదు కథలనూ చదివి, శ్రీదుర్గాదేవికి అరటిపండ్లను నివేదించి, వ్రతం తేలికగా ఆచరింపవచ్చును. వారు రాసే పరీక్షలలో వారికి తప్పక విజయం చేకూరుతుంది.
- ఏ శంకరమఠంలోనైనా కూర్చుని ఈ ఐదుకథలూ చదువుకుని అక్కడ కొలువై ఉన్న శారదా మాతకు అరటిపండ్లు నైవేద్యం పెడితే విశేష ఫలితం కలుగుతుంది. మీరు అనుకున్న పనులన్నీ విజయవంతంగా పూర్తవుతాయి. వివాహం కానివారికి వెంటనే వివాహం జరుగుతుంది. సంతానం లేనివారికి త్వరలోనే సత్సంతానం కలుగుతుంది. విద్యార్థులు కానీ, వారి తల్లిదండ్రులు కానీ ఇలా ఆచరించినచో వారికి పరీక్షలలో విజయం చేకూరుతుంది. ఉదయాన్నే కానీ, సాయంత్రం కానీ ఎప్పుడైనా ఆచరింపవచ్చును. ఉపవాసం ఉండనవసరం లేదు.
- ఈ వ్రతం ఆచరించేటప్పుడు భార్య, భర్తలు ఇద్దరూ తప్పక కలిసి ఆచరించాలనే నియమం లేదు. భర్తకు వీలున్నప్పుడు భర్త, భార్యకు వీలున్నప్పుడు భార్య, ఇలా ఎవరి వీలును బట్టి వారు ఆచరించవచ్చును. వీలున్నప్పుడు ఇద్దరూ కలిసి ఆచరింపవచ్చును.
- దురదృష్టవశాత్తు భార్యను కోల్పోయిన పురుషులు కానీ, భర్తను కోల్పోయిన స్త్రీలు కాని కూడా నిరభ్యంతరంగా ఈ వ్రతం ఆచరింపవచ్చును. ఈ వ్రతం ఆచరించినవారికి పూర్తి మనశ్శాంతి కలుగుతుంది.
- సంతానం లేనివారు ఏ ఆలయంలోనైనా శుక్రవారం ఈ పుస్తకం పఠిస్తే తప్పక చక్కటి సంతానం కలుగుతుంది. వివాహం కాని కన్యలు కానీ, యువకులు కానీ, ఈ విధంగా చదివితే త్వరలో వివాహం జరుగుతుంది.
- దూరదేశాలలో ఉండే మీ పిల్లల నిమిత్తం, మీరు కూడా చదువవచ్చును. వారికి విద్య, వివాహం, సంతానం, ఉద్యోగం, ఆరోగ్యం కొరకు ఈ పుస్తకాన్ని శుక్రవారం నాడు ఏ ఆలయంలోనైనా చదివితే వెంటనే ఫలితం కలుగుతుంది.

ఈ విధంగా ఏ రీతిలోనైనా, ఏ రోజైనా, ఈ పుస్తకం పఠించి శ్రీ శుభదుర్గామాత అనుగ్రహం పొందవచ్చును.

– తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

Hyderabad
2015

Viswapathi@yahoo.com
shridesigns@gmail.com
Ph : 9849443752

శ్రీ దుర్గా అష్టోత్తర శతనామావళిః

ఓం దుర్గాయై నమః
ఓం శివాయై నమః
ఓం మహాలక్ష్మై నమః
ఓం మహాగౌర్యై నమః
ఓం చండికాయై నమః
ఓం సర్వజ్ఞాయై నమః
ఓం సర్వలోకేశ్యై నమః
ఓం సర్వకర్మఫలప్రదాయై నమః
ఓం సర్వతీర్థమయ్యై నమః
ఓం పుణ్యాయై నమః
ఓం దేవయోనయే నమః
ఓం అయోనిజాయై నమః
ఓం భూమిజాయై నమః
ఓం నిర్గుణాయై నమః
ఓం ఆధారశక్త్యై నమః
ఓం అనీశ్వర్యై నమః
ఓం నిర్గమాయై నమః
ఓం నిరాకారాయై నమః
ఓం సర్వగర్వవిమర్థిన్యై నమః
ఓం సర్వలోక ప్రియాయై నమః
ఓం వాణ్యై నమః
ఓం సర్వవిద్యాధిదేవతాయై నమః
ఓం పార్వత్యై నమః
ఓం దేవమాత్రే నమః
ఓం అనీశాయై నమః
ఓం వింధ్యవాసిన్యై నమః
ఓం తేజోవత్యై నమః
ఓం మహామాత్రే నమః
ఓం కోటిసూర్యసమప్రభాయై నమః
ఓం దేవతాయై నమః
ఓం వహ్నిరూపాయై నమః
ఓం తేజసే నమః
ఓం వర్ణరూపిణ్యై నమః
ఓం గుణాశ్రయాయై నమః
ఓం గుణమధ్యాయై నమః
ఓం గుణత్రయవివర్జితాయై నమః
ఓం కర్మజ్ఞానప్రదాయై నమః
ఓం కాంతాయై నమః
ఓం సర్వసంహారకారిణ్యై నమః
ఓం ధర్మజ్ఞానాయై నమః 40
ఓం ధర్మనిష్ఠాయై నమః
ఓం సర్వకర్మ వివర్జితాయై నమః
ఓం కామాక్ష్యై నమః
ఓం కామసంహర్త్యై నమః
ఓం కామక్రోధవివర్జితాయై నమః
ఓం శాంకర్యై నమః
ఓం శాంభవ్యై నమః
ఓం శాంతాయై నమః
ఓం చంద్రసూర్యాగ్నిలోచనాయై నమః
ఓం సుజయాయై నమః 50
ఓం జయభూమిష్ఠాయై నమః
ఓం జాహ్నవ్యై నమః
ఓం జనపూజితాయై నమః
ఓం శాస్త్రాయై నమః
ఓం శాస్త్రమయై నమః
ఓం నిత్యాయై నమః
ఓం శుభాయై నమః
ఓం చంద్రార్థమస్తకాయై నమః

ఓం భారత్యై నమః
ఓం భ్రామర్యై నమః 60
ఓం కల్పాయై నమః
ఓం కరాళ్యై నమః
ఓం కృష్ణపింగళాయై నమః
ఓం బ్రాహ్మ్యై నమః
ఓం నారాయణ్యై నమః
ఓం రౌద్ర్యై నమః
ఓం చంద్రామృతపరిస్రుతాయై నమః
ఓం జ్యేష్ఠాయై నమః
ఓం ఇందిరాయై నమః
ఓం మహామాయాయై నమః 70
ఓం జగత్సృష్ట్యధికారిణ్యై నమః
ఓం బ్రహ్మాండకోటిసంస్థానాయై నమః
ఓం కామిన్యై నమః
ఓం కమలాలయాయై నమః
ఓం కాత్యాయన్యై నమః
ఓం కలాతీతాయై నమః
ఓం కాలసంహారకారిణ్యై నమః
ఓం యోగనిష్ఠాయై నమః
ఓం యోగిగమ్యాయై నమః
ఓం యోగిధ్యేయాయై నమః 80
ఓం తపస్విన్యై నమః
ఓం జ్ఞానరూపాయై నమః
ఓం నిరాకారాయై నమః
ఓం భక్తాభీష్టఫలప్రదాయై నమః
ఓం భూతాత్మికాయై నమః
ఓం భూతమాత్రే నమః
ఓం భూతేశ్యై నమః
ఓం భూతధారిణ్యై నమః
ఓం స్వధానారీమధ్యగతాయై నమః
ఓం షడాధారాదివర్ధిన్యై నమః 90
ఓం మోహితాయై నమః
ఓం అంశుభవాయై నమః
ఓం శుభ్రాయై నమః
ఓం సూక్ష్మాయై నమః
ఓం మాత్రాయై నమః
ఓం నిరాలసాయై నమః
ఓం నిమగ్నాయై నమః
ఓం నీలసంకాశాయై నమః
ఓం నిత్యాయై నమః
ఓం నందిన్యై నమః 100
ఓం హరాయై నమః
ఓం పరాయై నమః
ఓం సర్వజ్ఞానప్రదాయై నమః
ఓం అనంతాయై నమః
ఓం సత్యాయై నమః
ఓం దుర్లభరూపిణ్యై నమః
ఓం సరస్వత్యై నమః
ఓం సర్వగతాయై నమః 108
ఓం సర్వాభీష్ట ప్రదాయై నమః
ఓం శ్రీదుర్గాంబికాయై నమః

షోడశోపచారములు సమర్పయామి

అంబా శాంభవి మాతా శ్రీ దుర్గాదేవికి
షోడశోపచారములు సమర్పయామి

1. కదంబ వనవాసిని కాత్యాయని దేవతకు
ఆవాహన ప్రార్థనిదె ఆసనంబిదె
అద్వితీయ తేజస్వికి ఆనంద స్వరూపిణికి
అర్ఘ్యపాద్య ఆచమనం సమర్పయామి ॥

2. సర్వలోక మహేశ్వరి సాంబశివుని రాణికి
పంచామృత శుద్ధోదక స్నానంబిదిగో
పరమ పావనంబైన పరంజ్యోతి పార్వతికి
మస్త్రాలంకారమిదె సమర్పయామి ॥

3. గంధర్వాదుల నేలే గణనాధుని మాతకు
గంధం ఆభరణాలే సమర్పయామి
పూర్ణదయా జలనిధి పూజనీయ భవానికి
పుష్పాలంకరణమిదె సమర్పయామి ॥

4. సర్వలోక ప్రియావాణీ సర్వేశ్వర జననికి
ధూపాలు దీపాలు సమర్పయామి
పరబ్రహ్మ స్వరూపిణి పరమేశ్వరి దేవికి
పాలుపండ్లు నైవేద్యం సమర్పయామి ॥

5. కరుణామృత వర్షిణి కాళికాంబ దేవతకు
తాంబూలం ఆచమనం సమర్పయామి
ఒత్యసత్య తేజోమయ నిఖిలేశ్వరిమాతకు
నీరాజనమిదె నీకు సమర్పయామి ॥

6. మహిషాసుర మర్ధని మహాత్రిపుర సుందరికి
మంత్రపుష్పమిదె నీకు సమర్పయామి
అఖిల జగతిపై నీ కృప అందజేయుమా జననీ
అంజలిదె సదా నీకు సమర్పయామి ॥ ॥ అంజలిదె॥

శ్రీ లలితాదేవి నీరాజనం

1. శ్రీచక్రపురమందు స్థిరమైన శ్రీ లలిత పసిమి పాదాలకు నీరాజనం
పరమేశ్వరుని పుణ్య భాగ్యాల రాశి ఆ సింహ మధ్యకు నీరాజనం ॥శ్రీ॥

2. బంగారు హారాలు సింగార మొలకించు అంబికా హృదయాలు నీరాజనం
శ్రీగౌరి శ్రీమాత శ్రీమహారాజశ్రీ సింహాసనేశ్వరికి నీరాజనం ॥శ్రీ॥

3. కల్పతరువుగ నన్ను కాపాడు కరములకు కనకాంబరాలతో నీరాజనం
పాశాంకుశా పుష్ప బాణ చాపదరికి పరమ పావనమైన నీరాజనం ॥శ్రీ॥

4. కాంతి కిరణాలతో కలికి మెడల మెరిసెటి కళ్యాణసూత్రములకు నీరాజనం
కాంతలందరికి పసుపు కుంకుమ లిచ్చేటి కాత్యాయనికి నిత్యనీరాజనం॥శ్రీ॥

5. కలువరేకుల వంటి కన్నులా తల్లి శ్రీ రాజరాజేశ్వరికి నీరాజనం
ముదమార మోమున ముచ్చటగ ధరియించు కస్తూరి కుంకుమకునీరాజనం ॥శ్రీ॥

6. చంద్రవంకను శిరమకుటంబులో దాల్చు సౌందర్య లహరికి నీరాజనం
శుక్రవారం నాడు శుభము లొసగే తల్లి శ్రీ మహాలక్ష్మికి నీరాజనం ॥శ్రీ॥

7. శృంగేరి పీఠమున సుందరాకారిణీ శారదా మాతకూ నీరాజనం
ఎల్లలోకాలను చల్లగా పాలించు బ్రహ్మాండ రూపిణికి నీరాజనం ॥శ్రీ॥

8. ముగ్గురమ్మలకు, మూలమైన పెద్దమ్మకు ముత్యాలతో నిత్య నీరాజనం
రాగజీవనరాగ నామ సంకీర్తనగ రంజిల్లు కర్పూర ఽరాజనం ॥శ్రీ॥

9. జన్మ జన్మల తల్లికి జగదీశ్వరీ, నీకు భక్తజనులిచ్చేటి నీరాజనం
ఽరాజనం నిత్య నీరాజనం, నీరాజనం నిత్య నీరాజనం ॥శ్రీ॥

శ్రీ శుభ దుర్గ వ్రతం

మొదటి అధ్యాయం

కోమలాంబ కథ

పూర్వకాలంలో కృష్ణా తీరంలో శ్రీకాకుళం అనే గ్రామం ఉండేది. ఆ ఊరిలో రామాచారి అనే పేద బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను వంశపారంపర్యంగా వచ్చిన పౌరోహిత్యపు వృత్తి చేసుకుంటూ సంసారాన్ని పోషించుకునేవాడు. అతని భార్య కోమలాంబ కూడా ఎంతో సౌమ్యురాలై భర్తకి ఎంతో సహకరిస్తూ సంసారాన్ని జాగ్రత్తగా గడుపుతూ వచ్చేది. ఆ దంపతులకు లేక లేక ఇద్దరు కవలలు జన్మించారు. ఇద్దరూ ఆడపిల్లలే. ఆ పిల్లలకి లలిత, ప్రణతి అనే పేర్లు పెట్టుకున్నారు. ఇద్దరినీ అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశారు.

ఇలా ఉండగా వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు పడక, విపరీతమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజలు తినడానికి ఆహారం లేక ఎంతో బాధపడ్డారు. ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేక ప్రజలు పూజలు, వ్రతాలు కూడా చేయడం తగ్గించారు. దీనివలన రామాచారికి కూడా ఆదాయం తగ్గింది. ఇల్లు గడవడం చాలా కష్టమైంది. ఆడపిల్లలిద్దరికి 18 సంవత్సరాల వయసు వచ్చింది. ఇంక పెళ్ళి సంబంధాలు చూడాలని తలుస్తుండగా ఈ రెండు సంవత్సరాలు ఏ సంపాదనా లేక ఇల్లు గడవడమే చాలా కష్టతరమైంది. ఇక వివాహాల గురించి ఆలోచన చేసేదెలా.

రోజు రోజుకి ఇంట్లో ఉన్న సరుకులన్నీ నిండుకున్నాయి. ఇక రెండు రోజులైతే పూర్తి పస్తులు ఉండే పరిస్థితి. కోమలాంబకి చాలా బాధగా ఉంది. ఆమె ప్రతిరోజు శ్రీ దుర్గామాతను పూజించేది. ప్రతీ నిత్యం ఆ తల్లితో తమను ఈ కష్టాల నుంచి కాపాడమని మొరపెట్టుకునేది. అయినా ఆ కుటుంబ పరిస్థితులలో ఏమాత్రం మార్పు రాకపోవటం వలన ఎంతో బాధపడేది. ఒకనాటి రాత్రి ఇవే ఆలోచనలతో బాధపడుతూ నిద్రపోయింది.

ఆ తల్లిని ఎన్నో విధాల వేడుకుంటూ ఎలాగైనా తమ కుటుంబాన్ని కరుణించమని ప్రాధేయపడుతూ పడుకుంది. ఒకంతట నిద్ర పట్టడం లేదు. మనస్సులో బాధ

పొంగుతుండటం వలన ఏమాత్రం కనులు మూత పడటం లేదు. ఆ తల్లిని అలా ప్రార్థిస్తూనే ఉన్నది. కాసేపటికి కనులు మూతపడి చిన్న కునుకు పట్టింది. నిద్రలో ఆమెకు ఒక కల వచ్చింది. ఆ కలలో కోమలాంబ ఎంతో బాధతో వడివడిగా అడుగులు వేస్తూ ఊరి చివరన ఉన్న చెరువు వైపు నడుస్తున్నది. ఇక తనకు ఆత్మహత్య తప్ప శరణ్యం లేదని తలుస్తూ ఎంతో వేదనతో నడవసాగింది.

ఇలా కొంతదూరం వెళ్ళగానే ఒక్కసారిగా ఆమె కంటి ముందు ఒక పెద్ద కాంతి వెలవడింది. ఆ కాంతిలో ఒక స్త్రీమూర్తి అద్భుత సౌందర్యంతో వెలిగిపోతూ కనిపించింది. ఎన్నో దివ్య ఆభరణాలను ధరించి గొప్ప తేజస్సుతో ప్రకాశిస్తున్న ఆమెకు కోమలాంబ అప్రయత్నంగానే చేతులు జోడించి నమస్కరించింది. అప్పుడు ఆ స్త్రీమూర్తి కోమలాంబతో ఇలా అన్నది. అమ్మా కోమలాంబా! ఈ రోజుతో నీ కష్టాలన్నీ గట్టెక్కాయి. నీకు శుభ దుర్గా వ్రతం అనే విశిష్టమైన ఒక వ్రతాన్ని వివరిస్తాను. నేనే శుభదుర్గను. సర్వ శుభాలను అనుగ్రహిస్తాను. నీవు ఇంటికి వెళ్ళి రేపే ఈ వ్రతం ఆచరించు. నీకు, నీకుటుంబానికి ఎన్నో శుభాలు జరుగుతాయి అన్నది. అప్పుడు కోమలాంబ ఆ తల్లికి నమస్కరించి తల్లీ జగన్మాతా! నన్ను అనుగ్రహించినందుకు ఎంతో ఆనందం. నిన్ను ఎన్ని విధాల కీర్తించినా తక్కువే. నాయందు దయ ఉంచి ఆ వ్రత విధానం వివరంగా విశదీకరింపవలసింది అని వేడుకున్నది.

అప్పుడు శుభదుర్గామాత కోమలాంబతో ఈవిధంగా చెప్పింది. నేను ఇప్పుడు చెపుతున్న ఈ శుభదుర్గావ్రతం ఎంతో తేలికైంది. నాకెంతో ప్రీతిపాత్రమైనది. దీనిని ఆచరించినవారికి సర్వసౌభాగ్యాలు కలుగుతాయి. దేనికీ లోటుండదు. జీవితం శుభప్రదంగా గడుస్తుంది. తలపెట్టిన కార్యాలన్నీ జయప్రదంగా జరుగుతాయి. ఈ వ్రతాన్ని స్త్రీలైనా, పురుషులైనా ఎవరైనా ఆచరించవచ్చును. ఏ శుక్రవారం రోజైనా సూర్యోదయానికి ముందే లేచి, శుచిగా స్నానం చేసి ఈ వ్రతం ఆరంభించాలి. ముందుగా అష్టోత్తర నామాలు పఠించాలి. అటుపైన ఈ వ్రతంలోని ఐదు కథలనూ చదవాలి. బియ్యం, బెల్లం కలిపి చేసిన పాయసం నైవేద్యంగా పెట్టాలి. మీ పూజామందిరంలో కూర్చుని ఆచరింపవచ్చును. మీరు ఒక్కరుగా గానీ, మీ బంధుమిత్రులందరిని పిలిచి గానీ ఈ వ్రతం ఆచరింపవచ్చును. నా రూపాలైన విజయదుర్గ, కనకదుర్గ, శైలపుత్రి, గౌరీదేవి ఇలా ఏ రూపపు పటమైనా ఎదురుగా ఉంచుకొనవలెను. ఈ విధంగా వ్రతం పూర్తిచేసిన వెంటనే మీ ఇంటిలో ఎన్నో శుభాలు కలుగుతాయి. ఈవ్రతం పూర్తియిన తరువాత నేను ఆ ఇంటికి ఏదో ఒక రూపంలో వచ్చి ప్రసాదం స్వీకరిస్తాను. ఓ కోమలాంబా! రేపు శుక్రవారం. రేపే ఈ వ్రతం ఆచరించు. మీ కుటుంబానికి సర్వ సౌభాగ్యాలు కలుగుతాయి అని అమ్మ అనుగ్రహించింది.

కమలాంబ తెల్లవారగానే తనకు వచ్చిన కలగురించి తన భర్తకు చెప్పింది. భర్త ఎంతో సంతోషించాడు. వెంటనే కోమలాంబ శుభ్రంగా స్నానం చేసి పూజగదిలో కూర్చుని శ్రీ శుభదుర్గా వ్రతం ఆచరించింది. పాయసం నివేదించింది. పక్క ఇంటిలో గల తన స్నేహితురాలిని పిలిచి భోజనం పెట్టింది. తాంబూలం ఇచ్చింది. ఆ వ్రత ప్రభావంచేత ఆ రోజు సాయంత్రమే ఒక అద్భుతం జరిగింది. పక్క ఊరిలో గల జమిందారు ఒక పెద్ద గుడి కట్టిస్తున్నాడని ఆ గుడికి పూజారిగా రామాచారిని నియమించాలని తలచాడని కబురు పంపాడు. అంతేకాదు, మరునాడే వచ్చి రామాచారిని గుడి నిర్మాణానికి సంబంధించిన విషయాలన్నీ చూడమని అన్నాడు. శుభదుర్గా అనుగ్రహం చేత ఆ జమీందారు రామాచారికి ఎంతో ఎక్కువ జీతమిచ్చాడు. త్వరితకాలంలోనే ఆ కుటుంబ కష్టాలన్నీ తీరాయి. కుమార్తెలిద్దరికీ చక్కటి వరులు దొరికారు. వీరి వివాహాలు ఎంతో చక్కగా జరిగాయి. ఆ కుటుంబం ప్రతినెలా వీలున్న శుక్రవారం నాడు శ్రీ శుభదుర్గా వ్రతం ఆచరిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

ప్రథమ అధ్యాయం సమాప్తం

యా దేవీ సర్వభూతేషు బుద్ధిరూపేణసంస్థితా।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః।

శ్రీ శుభ దుర్గ వ్రతం

రెండవ అధ్యాయం

జమీందారు కథ

పూర్వకాలంలో గోదావరీ నదీ తీరంలో దుర్గాపురం అనే గ్రామం ఉండేది. ఆ ఊరిలో రాఘవయ్య అనే జమీందారు ఉండేవాడు. అతనికి ఎన్నో వ్యాపారాలు ఉండేవి. ఎంతో ధన సంపద, పశు సంపద ఉండేవి. ఎన్నో పొలాలు ఉండేవి. రాఘవయ్యకు తాను ధనికుడననే అహంకారం ఉండేది. ఎంతటివారినైనా ఈ అహంకారమే కదా అధోపాతాళానికి తోసివేసేది! అయితే అతని భార్య శ్రీదేవి మాత్రం ఎంతో సౌమ్యురాలు. ఎల్లప్పుడూ పూజలలో మునిగి తేలుతుండేది. భర్తకు తెలియకుండా ఎన్నో దాన ధర్మాలు చేస్తుండేది. అన్నీ ఉన్నప్పటికీ వారికి సంతానం లేకపోవటం ఎంతో వెలితిగా ఉండేది.

ఆ ఊరిలో ఎంతో పురాతనమైన శ్రీ దుర్గామాత గుడి ఉండేది. ఆ ఆలయానికి ప్రతీ సంవత్సరం ఆశ్వయుజమాసంలో నవరాత్రి ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహించేవారు. ఆ ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి ఎందరో భక్తులు వచ్చేవారు. ఉత్సవాల నిర్వహణకోసం ఎందరో ధనికులు పెద్దఎత్తున విరాళాలు ఇచ్చేవారు. అయితే ఈ ఆలయ ధర్మకర్తలమండలి అధ్యక్షులు రాఘవయ్య మాత్రం చాలా కొద్దిసొమ్మే ఇచ్చేవాడు. అదికూడా ఏదో తప్పదన్నట్లుగా ఇచ్చేవాడు. అతడు అధ్యక్ష పదవిలో ఉండటం ఎవరికీ ఇష్టం లేకపోయినా ఊరిలో అందరికంటే ఎక్కువ ధనికుడు కావటంచేత అతనినే ఎప్పుడూ అధ్యక్షునిగా ఎన్నుకునేవారు. గత కొన్ని సంవత్సరాలుగా నవరాత్రి ఉత్సవాలకు వచ్చే చందాల సొమ్ము కూడా కొంచెం తన సొంత పనులకు వాడుకుంటున్నట్లు ప్రజలు అనుమానించేవారు. కానీ రాఘవయ్య ఇవేమీ లెక్క చేయకుండా భక్తులిచ్చిన సొమ్మును దుర్వినియోగం చేసేవాడు.

ఇలా ఉండగా ఆ సంవత్సరం ఉత్సవాలు పెద్ద ఎత్తున జరిగాయి. పంటలు బాగా పండటం చేత రైతులు చందాల రూపంలో ఎంతో ఎక్కువ సొమ్ము ఇచ్చారు. అంత సొమ్ము చూసేసరికి జమీందారుకి ఆశ పుట్టింది. అందులోనుంచి కొంచెం మాత్రమే ఉత్సవాలకు ఖర్చు పెట్టి చాలా ధనం తన వ్యాపారాలకు మళ్ళించాడు. ఇలా కొన్ని సంవత్సరాలు జగన్మాత సొమ్మును దుర్వినియోగం చేయటంతో ఆ తల్లికి ఆగ్రహం కలిగింది. అంతే! నవరాత్రులు అయిన మరునాడే జమీందారుకు పక్షవాతం వచ్చి మంచాన పడ్డాడు. భార్య శ్రీదేవికి ఎంతో బాధ కలిగింది. తన భర్త చేసిన దుర్మార్గాలవలననే ఇలా అనారోగ్యంపాలైనాడని తలచింది.

అనారోగ్యం మాత్రమే కాదు, మరుసటి నెలలో వ్యాపారాలలో విపరీతమైన నష్టం వచ్చింది. అకాల వర్షాలు కురిసి ఎంతో పంట నష్టం జరిగింది. వ్యాపారాలలో నష్టం రావటంతో రాఘవయ్య ఎన్నో అప్పులు చేశాడు. అవి తీర్చడానికి పొలం, కొద్ది కొద్దిగా అమ్మవలసి వచ్చింది. ఇలా రెండు సంవత్సరాలు గడిచేటప్పటికి అతని వద్ద కేవలం రెండే రెండు ఎకరాలు మిగిలాయి. ఎన్ని మందులు వాడినా లాభం లేక మంచంమీదనే ఉన్నాడు. భార్య శ్రీదేవి తమను ఈ కష్టాలనుండి బయటపడేయమని ఎందరో దేవతలకు మొక్కుకుంది. జమీందారుకి కూడా ఇప్పటికి తెలిసివచ్చింది. తాను జగన్మాత సొమ్ము దుర్వినియోగం చేసినందుకే ఈ అనర్థాలన్నీ జరిగినట్లు గమనించాడు.

ఇలా ఉండగా ఒకనాడు ఎవరో సాధువు వంటి వ్యక్తి ఇంటిబయట నుంచుని భవతీ భిక్షాందేహి అని అన్నాడు. సమయానికి ఇంట్లో ఏమీ లేక శ్రీదేవి ఒక ఖర్జూర కాయ అతడికి దానం చేసింది. కళ్ళనీళ్ళతో ఉన్న ఆ ఇల్లాలిని చూసి ఆ సాధువు అమ్మా! నీ కష్టాలన్నీ నాకు తెలిశాయి. నీవు శుభదుర్గా వ్రతం చేయి. అన్నీ సర్దుకుంటాయి. నీ కష్టాలన్నీ తొలగి మునుపటి వైభవం వస్తుంది అని చెప్పి ఆ వ్రతవిధానం అంతా వివరించి చెప్పాడు. శ్రీదేవి ఆ మరునాడే శుభదుర్గావ్రతం చేస్తానని సంకల్పం చేసుకుంది. ఇంతలో శ్రీదేవికి మరొక ఆలోచన కూడా వచ్చింది. ఈ వ్రతం నెలరోజులపాటు ప్రతిరోజు చేస్తానని అనుకుంది.

జమీందారు భార్య శ్రీదేవి మరునాడే మొదలుపెట్టి ఎంతో శ్రద్ధగా నెలరోజులు శ్రీ శుభదుర్గా వ్రతం ఆచరించింది. ప్రతీరోజూ ఉదయమే లేచి స్నానం చేసి వ్రతం చేసేది. అలా నెలరోజులు చేయగానే చివరిరోజున శుక్రవారం నాడు వ్రతం పూర్తి కాగానే ఇంటి గుమ్మం ముందు ఎవరో దంపతులు పిలుస్తున్నట్లు అనిపించి బయటకు వెళ్ళింది. ఇద్దరు బ్రాహ్మణ దంపతులు కనిపించారు. శ్రీదేవితో వారు తాము పక్కఊరు వెళుతూ ఇంత భోజనం దొరుకుంతుందేమోనని వచ్చామని అన్నారు. శ్రీదేవి వారిద్దరికి అన్నం వడ్డించింది. ఆ దంపతులిద్దరూ సంతోషంగా తిన్నారు. శుభదుర్గావ్రతం ప్రసాదం

కూడా స్వీకరించారు. వారు తిరిగి వెళ్ళిపోతూ ఆమె చేతిలో ఒక చిన్న మూట ఉంచి అమ్మా! ఇది కొద్దిపాటి ధనం మేము వెళ్ళిన తరువాత తీసి చూడు. అని చెప్పి వెళ్లిపోయారు.

వారు వెళ్ళిన కాసేపటికి మూట విప్పి చూసిన శ్రీదేవి ఆశ్చర్యపోయింది. ఆ మూటనిండా బంగారు కాసులు! అంతే కాదు, ఆ మూటలో ఒక చిన్న శివలింగం, ఒక చిన్న అమ్మవారి విగ్రహం ఉన్నాయి. ఆహా! సాక్షాత్తూ ఆ ఆదిదంపతులే తనను కరుణించారని గ్రహించింది. ప్రసాదం స్వీకరించడానికి ఆ పార్వతీ పరమేశ్వరులే బ్రాహ్మణ దంపతుల రూపంలో వచ్చారని గ్రహించి ఆమె ఎంతో ఆనందపడింది. వారి అనుగ్రహంతో కొద్ది రోజులలోనే జమీందారు కూడా పూర్తి ఆరోగ్యవంతుడైనాడు. మెల్లమెల్లగా సంవత్సరంలోనే తిరిగి మునుపటికంటే ధనవంతుడయ్యాడు. జమీందారులో ఎంతో మార్పు వచ్చింది. ఆలయానికి బంగారు తాపడం చేయించాడు. ఎంతో సన్మార్గంలో జీవించి, అనతి కాలంలోనే చుట్టుప్రక్కల గ్రామాలలో ఇంత గొప్ప ధర్మాత్ముడు లేడనే పేరు తెచ్చుకున్నాడు. రాఘవయ్య, శ్రీదేవి దంపతులిద్దరూ కలకాలం ఆ జగన్మాతను సేవిస్తూ సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందారు.

రెండవ అధ్యాయం సమాప్తం

యా దేవీ సర్వభూతేషు శక్తిరూపేణసంస్థితా।
నమస్తస్యై నమస్తస్యై నమసస్యై నమో నమః।

శ్రీ శుభ దుర్గ వ్రతం
మూడవ అధ్యాయం
కవల పిల్లల కథ

పూర్వకాలంలో ఆంధ్రదేశంలో శ్రీశైల పుణ్యక్షేత్రానికి దగ్గరలో వీరభద్రపురం అనే గ్రామం ఉండేది. ఆ గ్రామంలో రామయ్య అనే వడ్రంగి ఉండేవాడు. అతడు చిన్న చిన్న వడ్రంగి పనులు చేసుకుంటూ కాలం గడిపేవాడు. అతని భార్య సుమతి రామయ్యకు చేదోడు వాదోడుగా ఉండేది. ఆ దంపతులకు తండ్రినుంచి వారసత్వంగా సంక్రమించిన ఇల్లు ఉంది. దానిలో నివాసం ఉంటూ వచ్చిన దానితో సంతృప్తి పడుతూ జీవింపసాగారు. అయితే వారికి వివాహమై పన్నెండు సంవత్సరాలు అయినప్పటికి సంతానం కలగలేదు. ఇది వారికి పెద్ద వెలితిగా ఉండేది. సంతానం కోసం సుమతి ఎన్నో పూజలు చేసింది. అయినా ఫలితం లేకపోయింది. ఇది వారి మనసులలో ఎప్పుడూ బాధగా ఉండేది.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు రామయ్య వడ్రంగి పని నిమిత్తం పొరుగూరు కృష్ణాపురానికి వెళ్ళాడు. అక్కడ ఒకరు కొత్త ఇల్లు కట్టిస్తూ వడ్రంగి పని అంతా రామయ్యకు అప్పచెప్పారు. పని పూర్తయి గృహప్రవేశం జరిగే రోజు వచ్చింది. గృహప్రవేశానికి రామయ్య దంపతులను కూడా ఆ ఇంటి యజమాని ఆహ్వానించాడు. ఆ రోజు ఇంటి దంపతులిద్దరూ శుభదుర్గావ్రతం చేయడం సుమతి గమనించింది. ఈ వ్రతం తానెప్పుడూ విని ఉండలేదు. ఇదే విషయం ఆ ఇంటి యజమాని భార్యను అడిగింది. ఈ వ్రతం తమ ఇంట ఎప్పటినుంచో సాంప్రదాయంగా వస్తున్నదని, ఎవరైనా ఈ వ్రతం ఆచరింపవచ్చునని, ఎన్నో శుభాలు జరుగుతాయని ఇంటి యజమాని భార్య చెప్పింది. సుమతి ఆమె నుంచి శుభదుర్గా వ్రత విధానమంతా వివరంగా తెలుసుకున్నది.

కొన్ని రోజుల తర్వాత ఒక శుక్రవారం నాడు సుమతి శ్రీ శుభదుర్గా వ్రతం ఆచరించింది. తనకు చక్కటి సంతానాన్ని ప్రసాదించమని ఆ జగన్మాతను వేడుకున్నది. సంతానం కలిగిన తరువాత మళ్ళీ వ్రతం చేస్తానని అనుకుంది. ఆ వ్రత ఫలితంగా సుమతి ఆ తరువాత నెలలోనే గర్భం దాల్చి తొమ్మిది నెలలు నిండగానే పండంటి కవల పిల్లలను కన్నది. పిల్లలిద్దరికీ రామకృష్ణులని పేరు పెట్టుకున్నారు. పిల్లలిద్దరూ అల్లారు ముద్దుగా పెరిగి

పెద్దవారై మూడు సంవత్సరాల వయస్సుకు వచ్చారు. సుమతి శుభదుర్గా వ్రతం చెయ్యటం మరచిపోయింది. పిల్లలు పుట్టిన తరువాత బంధువులందరినీ పిలిచి వైభవంగా వ్రతం చేస్తానన్న సంకల్పం నెరవేర్చకుండా ఉన్నందుకు దుర్గాదేవికి కోపం వచ్చింది. ఒక సంవత్సరం కాదు, మూడు సంవత్సరాలైనా ఆమె ఈ వ్రతం చేయనందుకు సుమతిపై ఆగ్రహం కలిగింది.

ఒకనాడు ఇంట బయట ఆడుకుంటున్న పిల్లలిద్దరూ మాయమయ్యారు. రామయ్య, సుమతి ఊరంతా ఎంత వెతికినా కనపడలేదు. లేక లేక కలిగిన పిల్లలు ఏమయ్యారోనని ఎంతో బాధపడ్డారు. తాము ఏం పాపం చేసి ఉంటామని ఎంతో కుంగిపోయారు. అప్పుడు సుమతికి గుర్తుకు వచ్చింది. తాము శుభదుర్గా వ్రతం చేయటం మరచినట్లు జ్ఞాపకం వచ్చింది. అందువలననే పిల్లలు మాయమయ్యారని గ్రహించింది. ఆ మరునాడు శుక్రవారమే. రేపు ఎలాగైనా ఈ వ్రతం ఆచరింపవలసిందేనని ఆ దంపతులిద్దరూ అనుకున్నారు. బంధుమిత్రులందరికీ కబురు పెట్టారు.

పిల్లలు తప్పిపోయినందుకు మనసులో బాధపడుతూ, రామయ్య, సుమతి దంపతులిద్దరూ మరునాడు శుక్రవారం ఉదయాన్నే లేచి శుభదుర్గావ్రతం ఎంతో శ్రద్ధగా ఆచరించారు. తమ పిల్లల జాడ తెలపమని ఆ తల్లిని ఎంతో వేడుకున్నారు. వ్రతం పూర్తయి నివేదన జరుగుతున్న సమయంలో వీరి దూరపు బంధువు జానకమ్మ ఇద్దరు పిల్లలను తీసుకుని లోపలికి వచ్చింది. అక్కడ ఉన్నవారందరూ ఎంతో సంతోషపడ్డారు. జానకమ్మ రామయ్యకు దూరపు బంధువు.. ఆమె రామయ్యతో మాట్లాడుతూ ఉదయాన్నే పక్కఊరి గుడికి ఏదో పూజ నిమిత్తం వెళ్ళి రావడంతో ఇక్కడకు రావటానికి ఆలస్యం అయిందని అన్నది. పక్క ఊరినుంచి వస్తూ ఉంటే ఒక చెట్టుకింద రామకృష్ణులు ఇద్దరూ కనపడ్డారని చెప్పింది. రామయ్య దంపతుల సంతోషానికి అవధులు లేవు. వారు పిల్లలు తిరిగి దొరికినందుకు ఎంతో సంతోషపడ్డారు.

మధ్యాహ్నం భోజనాలు అవగానే బంధువులందరూ వెళ్ళిపోయారు. జానకమ్మ కూడా తనింటికి వెళ్ళబోయింది. తమ పిల్లలను తిరిగి తీసుకుని వచ్చినందుకు రామయ్య దంపతులు ఆమెకు కృతజ్ఞతలు చెప్పి చీర, రవిక ఇచ్చి బహుకరించారు. అవి తీసుకుని జానకమ్మ ఆ దంపతులను ఆశీర్వదించి వెళ్లిపోయింది. ఆ దంపతులిద్దరూ పిల్లలిద్దరితో కాసేపు కబుర్లు చెప్పి కాసేపు విశ్రమించారు. ఇంతలో సాయంత్రం అయిదు గంటలయ్యింది. ఎవరో ఇంటి తలుపు కొడితే వెళ్ళి సుమతి తలుపు తీసింది. జానకమ్మ మరలా వచ్చింది. సుమతి ఆమెతో ఏం! అత్తా! ఏమైనా మరచిపోయావా మళ్ళీ వచ్చావు అని అన్నది. అప్పుడు ఆమె ఆశ్చర్యంగా మళ్ళీ రావటమేమటి, అసలు నేను వ్రతానికి వస్తే

కదా! నిన్ననే వేరే ఊరు వెళ్ళటం చేత ఇప్పుడే ఇంటికి వచ్చాను. ఉదయం నీవు వ్రతం చేసుకున్నావు అని తెలిసి ప్రసాదం అయినా తీసుకుందామని వచ్చాను అని అన్నది. ఇది విన్న సుమతి ఆశ్చర్యపోయింది. జరిగినవిషయం అర్థమైంది. ఉదయం జానకమ్మ రూపంలో వచ్చింది సాక్షాత్తూ శుభదుర్గాదేవియే అని గ్రహించింది. తల్లీ! నిన్ను గ్రహించలేకపోయానే! పిల్లలిద్దరినీ తీసుకురావటమే కాక తాంబూలం కూడా తీసుకుని వెళ్ళావు. నీకు భక్తులంటే ఎంతటి అనుగ్రహం తల్లీ! అని ఆ జగన్మాతను పరిపరివిధాల స్తుతించింది. జరిగినదంతా తెలుసుకుని జానకమ్మ కూడా ఎంతో ఆశ్చర్యపోయింది. అప్పటినుంచి రామయ్య, సుమతి దంపతులిద్దరూ ప్రతీనెలా శ్రీ శుభదుర్గా వ్రతం ఆచరిస్తూ కలకాలం సుఖంగా జీవించారు.

మూడవ అధ్యాయం సమాప్తం

యా దేవీ సర్వభూతేషు శాంతిరూపేణసంస్థితా।
నమస్తస్యై నమస్తస్యై నమసస్యై నమో నమః।

శ్రీ శుభ దుర్గ వ్రతం

నాల్గవ అధ్యాయం

అన్నపూర్ణమ్మ కథ

పూర్వకాలంలో కావేరీ నదీ తీరంలో కృష్ణశర్మ అనే సద్బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు అనేక శాస్త్రాలలో ఎంతో ప్రావీణ్యం సంపాదించి ఆ ఊరిలోని వేదపాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసేవాడు. అతని భార్య అన్నపూర్ణమ్మ ఎంతో గుణవంతురాలు. కృష్ణశర్మకు ఇద్దరు కుమారులు. ఆ ఇద్దరూ ఆ వేదపాఠశాలలోనే చదువుకుంటున్నారు. కృష్ణశర్మ భార్య అన్నపూర్ణమ్మ పేరుకు తగ్గట్టుగా ఇంటికి వచ్చినవారినందరినీ ఎంతో ఆదరించేది. ఏ సమయంలో వచ్చిన అతిథినైనా భోజనం పెట్టకుండా పంపేది కాదు. భార్య, భర్తలిద్దరికీ దయాగుణం ఉండటంచేత ఆ ఇంటికి వచ్చినవారికి అతిథి మర్యాదలకు లోటుండేది కాదు. ఏదైనా సలహాల నిమిత్తం కృష్ణశర్మ వద్దకు వచ్చినవారికి కూడా అన్నపూర్ణమ్మ భోజనం పెట్టి పంపేది.

రోజులిలా గడుస్తుండగా ఒకనాడు అన్నపూర్ణమ్మకి కుడికాలు చాలా నొప్పి చేసింది. అడుగుతీసి అడుగు వేయటం కష్టంగా ఉంది. ఊరిలోని వైద్యునికి చూపిస్తే కొన్ని మందులు ఇచ్చాడు. రెండు మాసాలు వాడినా అంత ప్రయోజనం లేకపోయింది. అన్నపూర్ణమ్మకు రోజూ చీకటితోనే నిద్రలేచి బావిలో నీళ్ళు తోడుకుని చన్నీటిస్నానం చేసే అలవాటు ఉంది. మడితోనే వంట వండి ప్రతిరోజు దుర్గామాతకు పూజచేసి నైవేద్యం పెట్టేది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా అమ్మవారికి నివేదన చేసేది. ఈ కాలునొప్పి రావటంతో ఉదయాన్నే చీకటితో లేచి పెరటిలో బావిదగ్గరకి వెళ్ళడం కష్టంగా ఉంది. ఏదో అలాగే నెట్టుకు వస్తోంది.

ఇలా ఉండగా ఒకనాడు తెల్లవారుఝామున అన్నపూర్ణమ్మ చీకటిలో కాలు ఏదో రాయిమీద పడి తూలి కింద పడింది. అక్కడితో కాలు చాలా నొప్పి చేసింది. వైద్యుడు వచ్చి చూసి రెండు నెలలు మంచంమీదనే ఉండాలన్నాడు. అన్నపూర్ణమ్మకు ఏమాత్రం పాలు పోలేదు. ఇలా మంచంమీద పడితే ఇంట్లో పనిచేసేది ఎవరు? భర్తకు, కుమారులకు వారి వారి పనులతోనే సరిపోతుంది. జగన్మాతకు ఉదయాన్నే నైవేద్యం ఎవరు పెడతారా అని ఎంతో బాధ పడింది. భర్త ఆమెను ఊరడించి తాను మడి కట్టుకుని నైవేద్యం పెడతానని అన్నాడు.

కృష్ణశర్మ భార్య బాధ చూడలేక అలా అన్నాడే కానీ వంటచేయటం తనవల్ల కాలేదు. పనులన్నీ చేసుకుని వేదపాఠశాలకు వెళ్ళేటప్పటికి చాలా ఆలస్యం అయ్యేది. భర్త పరిస్థితి చూసి అన్నపూర్ణమ్మ జగన్మాతను తన బాధ నుంచి త్వరగా బయటపడవేయమని వేడుకుంది. ఒకనాడు ఉదయం భర్త, పిల్లలు పాఠశాలకు వెళ్ళగానే ఒక పది సంవత్సరాల వయస్సు గల పిల్ల వీరింటికి వచ్చింది. అన్నపూర్ణమ్మ ఆమెను ఎవరమ్మా నీవు ఎందుకు వచ్చావు అని అడిగింది. అప్పుడు ఆ బాలిక అన్నపూర్ణమ్మతో అమ్మా నేను పక్కఊరిలో ఉంటాను. నా తల్లితండ్రులు నన్ను ఒంటరిదాన్ని చేసి ఎటో దూరదేశాలకు వెళ్ళిపోయారు. నాకెవరూ దిక్కు లేరు. మీరు కాస్త ఆశ్రయమిస్తే వారు తిరిగి వచ్చేవరకు మీ ఇంటనే ఉంటాను అని అన్నది. అన్నపూర్ణమ్మకు ఆ పిల్లని చూసి జాలి కలిగింది. ఎంతో చక్కగా చూడముచ్చటగా ఉన్న ఆ పిల్లని ఇక్కడే ఉండవచ్చునని చెప్పింది. భర్త కూడా ఏమీ అభ్యంతరం పెట్టలేదు.

ఆ బాలిక ప్రతిరోజూ ఉదయమే లేచి ఇల్లంతా శుభ్రం చేసి చక్కగా తలంటు పోసుకుని వంటచేసేది. అమ్మవారికి నైవేద్యం పెట్టేది. అందరూ నిద్రలేచేటప్పటికే వంట పూర్తిగా చేసి సిద్ధంగా ఉంచేది. అంతేకాదు, అన్నపూర్ణమ్మకు ఏది కావలసినా క్షణంలో తెచ్చి ఇచ్చేది. కాలుకు రోజూ మందు రాసేది. వేళకు మంచంవద్దకు భోజనం తెచ్చి ఇచ్చేది. అన్నపూర్ణమ్మ ఆ బాలికను చూసి ఎంతో మురిసిపోంది. నెలరోజులలోనే అన్నపూర్ణమ్మ ఎంతో కోలుకుంది. నెమ్మదిగా మంచం దిగి పనులు చేసుకొనడం మొదలుపెట్టింది. ఆ బాలిక వచ్చిన వేళా విశేషం వలననే ఇదంతా జరిగిందని తలచింది. ఆ రోజు రాత్రి భర్తతో ఈ బాలికను ఎప్పటికీ మన వద్దే ఉంచుకుని ఆమెకు మనమే పెళ్ళి చేద్దాం అని అన్నది. భర్త అందుకు సంతోషంగా ఒప్పుకున్నాడు.

అన్నపూర్ణమ్మ సంతోషంగా నిద్రపోయింది. నిద్రలో ఆమెకు ఒక అద్భుతమైన కల వచ్చింది. ఆ కలలో ఒక దేవత ప్రత్యక్షమై ఇలా అన్నది. అన్నపూర్ణమ్మా! నేను శుభదుర్గను. ఎల్లప్పుడూ నన్ను కొలిచేవారిని నిత్యం రక్షిస్తుంటాను. నీవంటే నాకెంతో అభిమానం. అందుకే నేను బాలికరూపంలో మీ ఇంటికి వచ్చాను. నీవు పూర్తిగా

కోలుకున్నావు. ఇక నేను రేపు ఉదయం నుంచి మీకు కనపడను. మీ ఇద్దరు దంపతుల యొక్క సౌశీల్యం నన్నెంతో ఆనందింపచేసింది. మీ కుటుంబం కలకాలం సుఖంగా ఉంటారు. అని చెప్పి మాయమైంది. మరునాడు నిద్రలేవగానే కలలో చెప్పినట్లుగానే ఆ బాలిక కనపడలేదు. అన్నపూర్ణమ్మ ఎంతో ఆశ్చర్యపోయింది. ఓ జగన్మాతా! నీచేతనే సేవ చేయించుకున్నానా తల్లీ! నీ వర్చస్సు చేసైనా నిన్ను గుర్తు పట్టలేకపోయానే? ఎంతటి మూర్ఖురాలిని? సృష్టి మొత్తం నీ సేవకై పరితపిస్తుంటే నీవు వచ్చి నాకు సేవ చేసావా తల్లీ! ఆహా! నా భాగ్యం ఏమని చెప్పుదును అని ఆ తల్లిని ఎన్నోవిధాల స్తుతించింది. అటు తరువాత కృష్ణశర్మ కుటుంబం అంతా నిత్యం శ్రీ శుభదుర్గాదేవిని కొలుస్తూ కలకాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందారు.

చతుర్థ అధ్యాయం సమాప్తం.

యా దేవీ సర్వభూతేషు దయారూపేణసంస్థితా।
నమస్తస్యై నమస్తస్యై నమసస్యై నమో నమః।

శ్రీ శుభ దుర్గ వ్రతం

అయిదవ అధ్యాయం

కేశవవర్మ కథ

పూర్వకాలంలో తుంగభద్రా నదీ తీరంలో కేశవపురం అనే పట్టణం ఉండేది. ఆ పట్టణంలో అనేకమంది ధనవంతులు ఉండేవారు. వారిలో కేశవవర్మ ప్రముఖుడు. కేశవవర్మకు తాత తండ్రుల నుంచి ఎంతో ఆస్తి సంక్రమించింది. ఎన్నో వందల ఎకరాల పంట పొలాలు ఉండేవి. ఇల్లంతా ఎప్పుడూ పనివాళ్ళతో హడావిడిగా ఉండేది. కేశవవర్మ భార్య రుక్మిణి ఎంతో సౌమ్యురాలు. ఆ దంపతులిద్దరూ తాము ధనవంతులమనే అహంకారం ఏమాత్రం లేకుండా ఎన్నో దాన ధర్మాలు చేసేవారు. ఇంట్లో పనిచేసేవారిని కూడా ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు.

కేశవవర్మకు ఇద్దరు కుమారులు. వీరు కూడా ఎంతో మంచి స్వభావం కలవారై తండ్రికి అన్ని విషయాలలో చేదోడువాదోడుగా ఉండేవారు. ఆ ఊరిలో పురాతన కాలంనాటి చెన్నకేశవస్వామి ఆలయం ఉండేది. ఆ ఆలయ సంరక్షణ మొత్తం కేశవవర్మ కుటుంబమే చూసేది. రుక్మిణమ్మకు జగన్మాత దుర్గాదేవి అంటే ఎంతో భక్తి. ప్రతీ సంవత్సరం దసరా నవరాత్రులు ఎంతో వైభవంగా నిర్వహించేది. ఊరిలోని ముత్తైదువలను అందరినీ పిలిచి చీర, రవికలు ఇచ్చి సత్కరించేది. రుక్మిణి ఎప్పుడూ చిరునవ్వుతో ఎంతో కళ కళలాడుతూ కనపడేది.

రోజులిలా గడుస్తుండగా ఒకనాటి రాత్రి కేశవవర్మకు విపరీతమైన కడుపునొప్పి వచ్చింది. వెంటనే పట్టణంలోని ప్రముఖవైద్యులకు కబురు పంపగా వారు వచ్చి మందులిచ్చారు. ఉదయానికి కొంచెం తగ్గింది. కానీ మధ్యాహ్నం తిరిగి మరలా వచ్చింది. ఇలా వారం రోజులు గడిచింది. నొప్పి ఏమాత్రం తగ్గటం లేదు. ఏమి తిన్నా నొప్పి వచ్చేది. పక్కన

పట్టణం నుంచి ఎంతో ప్రముఖ వైద్యుడు వచ్చి కొత్త మందు ఇచ్చాడు. దాని ప్రభావం రెండు రోజులు మాత్రమే ఉంది. ఏదైనా పండు తింటే నొప్పి ఇంకా ఎక్కువ కాసాగింది. ఇదంతా ఏదో పూర్వజన్మలో చేసుకున్న పాపఫలంగా జరిగి ఉంటుందని ఆ దంపతులు తలచారు. రోజులు తరబడి ఆహారం లేకపోవటం చేత కేశవవర్మ ఎంతో నీరస పడ్డాడు.
కేశవవర్మ భార్య రుక్మిణి తన భర్త ఆరోగ్యం కోసం ఎన్నో వ్రతాలు ఆచరించింది. కానీ ఏమాత్రం ఫలితం లేకపోయింది. ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి. ఈ రెండు సంవత్సరాలు వారు తిరగని పుణ్యక్షేత్రం లేదు. అయినా కేశవవర్మకు ఏమాత్రం ఉపమశమనం లభించలేదు. కొద్దిగా తిన్నా కూడా విపరీతమైన కడుపునొప్పి వచ్చేది. ఇలా ఉండగా ఒకనాడు పక్కఊరిలో ఉన్న శ్రీ దుర్గాదేవి ఆలయంలో శుక్రవారం నాడు పూజ చేయమని ఎవరో చెప్పారు. ఇంతకుముందు రుక్మిణి ఎన్నోసార్లు ఆ ఆలయానికి వెళ్ళింది. కేశవవర్మ దీని వలన ఏం లాభం ఉంటుందని అన్నాడు. కానీ రుక్మిణి ఊరుకోలేదు. వెళ్ళి తీరాలని అన్నది.
శుక్రవారం నాడు ఉదయమే భర్తతో కలిసి బండిలో ప్రయాణమై తన కుమారులను కూడా తీసుకుని ఆ ఆలయానికి వెళ్ళింది. ఆమె అక్కడికి వెళ్ళేసరికి కొందరు స్త్రీలు అక్కడి మండపంలో కూర్చుని ఏదో వ్రతకథలను చదువుతున్నారు. రుక్మిణి అక్కడే ఆ కథలు పూర్తయ్యేదాకా ఉండి ప్రసాదంగా ఇచ్చిన అరటిపండును తీసుకుంది. ఆమె ఆ పండును కళ్ళకు అద్దుకుని సగం తాను తీసుకుని, మిగిలిన సగం భర్తకు ఇచ్చింది. అప్పుడు కేశవవర్మ రుక్మిణీ! పండ్లు తింటే నాకు కడుపునొప్పి ఇంకా ఎక్కువవుతుందని నీకు తెలుసు కదా అని అన్నాడు. కానీ ఏదో మొండిధైర్యం వచ్చి ఆ అరటిపండు తిన్నాడు. అంతే ఆశ్చర్యకరంగా శరీరమంతా ఏదో విద్యుత్తు ప్రసరించినట్లయింది. ఒళ్ళంతా ఎంతో తేజోవంతంగా అనిపించింది. ఏమాత్రం కడుపునొప్పి రాలేదు.
తను భర్తను చూసిన రుక్మిణి ఎంతో ఆశ్చర్యపడుతూ ఆ స్త్రీలవద్దకు వెళ్ళి ఈ వ్రతం ఏమిటని అడిగింది. వారు ఇది శ్రీ శుభదుర్గావ్రతం అని ఎంతో మహిమాన్వితమైనదని అన్నారు. రుక్మిణి అప్పటినుండి ప్రతీ శుక్రవారం శ్రీ శుభదుర్గా వ్రతం చేయటం ప్రారంభించింది. ఆ వ్రత ఫలితంగా కేశవవర్మ పూర్తి ఆరోగ్యవంతుడయ్యాడు. కేశవవర్మ, రుక్మిణి దంపతులిద్దరూ ఆ శుభదుర్గాదేవి అనుగ్రహం చేత కలకాలం సుఖంగా జీవించి చివరన ముక్తిని పొందారు.
సాక్షాత్తూ శ్రీ శుభదుర్గాదేవియే తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి అనే భక్తునికి అనుగ్రహించిన ఈ వ్రతం అత్యంత మహిమ కలది. ప్రతీ నెలా ఏ శుక్రవారం నాడైనా చేసుకొనవచ్చును. ముఖ్యంగా చైత్ర, వైశాఖ, శ్రావణ, ఆశ్వయుజ, కార్తీక, మార్గశిర, మాఘ మాసములలో ఏ శుక్రవారం నాడు ఆచరించినా అత్యంత ఫలదాయకం. దశమి లేదా ఏకాదశి లేదా పౌర్ణమిలతో కూడిన శుక్రవారమైతే ఎంతో శ్రేష్టం. దశరా

నవరాత్రులలో ఏ రోజునైనా ఆచరిస్తే ఎన్నో శుభాలు కలుగుతాయి. నవరాత్రులలో ప్రతీరోజు ఆచరించిన వారికి వేయి అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. ఈ వ్రతం ఆచరించే స్త్రీలు దీర్ఘసుమంగళీ మణులుగా ఉంటారు. ఈ వ్రతం చేసే కన్యలకు చక్కటి వరులతో వెంటనే వివాహం నిశ్చయమౌతుంది. సంతానం లేనివారు చేసిన యెడల చక్కటి సంతానం కలుగుతుంది. అనారోగ్యంతో ఉన్నవారికి వెంటనే చక్కటి ఆరోగ్యం కలుగుతుంది. వ్యాపారంలో లాభం కలుగుతుంది. ఏ ఇంట ప్రతి శుక్రవారం దంపతులలో ఏ ఒక్కరైనా ఈ వ్రతం చేస్తూ ఉంటారో వారి ఇంట సర్వసౌభాగ్యాలూ కలుగుతాయి. వారి గృహం ఎల్లప్పుడూ ధన ధాన్యాలతో సమృద్ధిగా ఉంటుంది. దేనికీ లోటుండదు. సాక్షాత్తూ జగన్మాతయే విశ్వపతి అనే భక్తునికి అనుగ్రహించిన ఈ శ్రీశుభదుర్గా వ్రతం ఈ కలియుగంలో అన్ని కష్టాలనుంచి బయట పడటానికి ఎంతో సులభమార్గం. సర్వసౌభాగ్యాలూ కలగటానికి ఎంతో తేలికమార్గం. వ్రతకథలు విన్నవారికి, ప్రసాదం స్వీకరిచినవారికి సకల శుభాలు జరుగుతాయి.
శ్రీ శుభదుర్గా దేవి అనుగ్రహంతో జీవితమంతా శుభప్రదంగా గడుస్తుంది.

పంచమ అధ్యాయం సమాప్తం.
యా దేవీ సర్వభూతేషు మాతృరూపేణసంస్థితా।
నమస్తస్యై నమస్తస్యై నమసస్యై నమో నమః।

హారతీ మీరేల ఇవ్వరే... అంబకు

హారతీ మీరేల ఇవ్వరే... అంబకు మంగళ హారతి మీరేల ఇవ్వరే
హారతీ మీరేల ఇవ్వరే జ్ఞాన విద్యలకెల్ల ప్రబలము
స్త్రీలలో పదియారు వెన్నెల – మేలిమి బంగారు తల్లికి
పాదములకూ పూజ సేయారే మా తల్లికిపుడు పారిజాతపు హారమివ్వారే ॥హారతి॥

ఆణిముత్యపు హారముల – మొల నూలు గజ్జెల
జోడు అందెల, రవ్వల పాపిడి బొట్టు ముంగెర
సమయముగ ధరియించు తల్లికి – హారతీ మీరేల ఇవ్వరే అంబకు ॥హారతి॥

ఇంత పరాకేల నానారే – శంభునీ దేవికి
చెంత నుండి పూజ సేయారే,
చెంత నుండి పూజ సేయారే – శంకరీ ఓంకారి మేదిని
కుంకుమాక్షతలంకారికి పొంకమైన అలంకారికి
హారతీ మీరేల ఇవ్వరే అంబకు ॥అంబకు॥

లక్షవత్తుల జ్యోతికూర్చరే, మా తల్లికిపుడు
పచ్చలా పళ్ళేరముంచారే రక్షితంబుగ నుండి
వేదాక్షరంబైన రాక్షస సంహారికిపుడు
ముచ్చటగ ముదముతో పాడుకొనుచూ,
హారతీ మీరేల ఇవ్వరే అంబకు ॥హారతి॥

మంగళ హారతి

మణిద్వీపవాసీ జయమంగళం
మంబిభాషిణీ శుభమంగళం
రత్నసింహాసినీ జయమంగళం
రాజీవలోచని శుభమంగళం
రాజరాజేశ్వరి జయమంగళం
రఉతగిరీశ్వరి శుభమంగళం

మహా సంపదలిచ్చు మణిద్వీప వర్ణన

1. మహాశక్తి మణిద్వీపనివాసిని
ముల్లోకాలకు మూలప్రకాశిని
మణిద్వీపములో మంత్రరూపిణి
మనసులలో కొలువైయున్నది.

2. సుగంధ పరిమళ పుష్పాలెన్నో వేలు
అనంతసుందర సువర్ణపూలు
అచంచలంబగు మనో సుఖాలు
మణిద్వీపానికి మహానిధులు

3. లక్షల లక్షల లావణ్యాలు
అక్షర లక్షల వాక్సంపదలు
లక్షల లక్షల లక్ష్మీపతులు
మణిద్వీపానికి మహానిధులు

4. పారిజాత వన సౌగంధాలు
సురాధినాధుల సత్సంగాలు
గంధర్వాదుల గానస్వరాలు
మణిద్వీపానికి మహానిధులు

భువనేశ్వరి సంకల్పమే జనియించె మణిద్వీపం
దేవదేవుల నివాసము అదియే కైవల్యం

5. పద్మరాగములు, సువర్ణమణులు
పది ఆమడలు పొడవునగలవు
మధుర మధురమగు చందనసుధలు
మణిద్వీపానికి మహానిధులు

6. అరువది నాలుగు కళామతల్లులు
వరాలనొసగే పదారుశక్తులు
పరివారముతో పంచబ్రహ్మలు
మణిద్వీపానికి మహానిధులు

7. అష్టసిద్ధులు నవనవనిధులు
అష్టదిక్కులూ దిక్పాలకులు
సృష్టికర్తలు సురలోకాలు
మణిద్వీపానికి మహానిధులు

8. కోటిసూర్యుల ప్రచండకాంతులు
కోటిచంద్రుల చల్లనివెలుగులు
కోటితారకల వెలుగుజిలుగులు
మణిశ్రీపానికి మహానిధులు ॥భువ॥

9. కంచుగోడల ప్రాకారాలు
రాగిగోడల చతురస్రాలు
ఏడామడల రత్నపురాసులు
మణిద్వీపానికి మహానిధులు

10. పంచామృతమయ సరోవరాలు
పంచలోహమయ ప్రాకారాలు
ప్రపంచమేలే ప్రజాధిపతులు
మణిద్వీపానికి మహానిధులు

11. ఇంద్రనీలమణి ఆభరణాలు
మజపుకోటలు వైఢూర్యాలు
పుష్యరాగమణి ప్రాకారాలు
మణిద్వీపానికి మహానిధులు

12. సప్తకోటి ఘనమంత్రవిద్యలు
సర్వశుభప్రద ఇచ్ఛాశక్తులు
శ్రీ గాయత్రి జ్ఞానశక్తులు
మణిద్వీపానికి మహానిధులు ॥భువ॥

13. మిలమిలలాడే ముత్యపురాసులు
తళతళలాడే చంద్రకాంతములు
విద్యుల్లతలు మరకతమణులు
మణిద్వీపానికి మహానిధులు

14. కుబేర ఇంద్ర వరుణదేవులు
శుభాల నొసగే అగ్నివాయువులు
భూమి గణపతి పరివారములు
మణిద్వీపానికి మహానిధులు

15. భక్తిజ్ఞాన వైరాగ్యసిద్ధులు
పంచభూతములు పంచశక్తులు
సప్తఋషులు, నవగ్రహాలు
మణిద్వీపానికి మహానిధులు

16. కస్తూరి మల్లికకుందన వనాలు
సూర్యకాంతి శిల మహాగ్రహాలు
ఆరు ఋతువులు చతుర్వేదాలు
మణిద్వీపానికి మహానిధులు ॥భువ॥

17. మంత్రిణి దండిని శక్తి సేనలు
కాళికరాళి సేనాపతులు
ముప్పదిరెండు మహాశక్తులు
మణిద్వీపానికి మహానిధులు

18. సువర్ణ రంజిత సుందరగిరులు
అనంతదేవి పరిచారకులు
గోమేధికమణి నిర్మితగుహలు
మణిద్వీపానికి మహానిధులు

19. సప్త సముద్రములనంత నిధులు
యక్షకిన్నెర కింపురుషాదులు
నానాజగములు నదీనదములు
మణిద్వీపానికి మహానిధులు

20. మానవ మాధవదేవగణములు
కామధేనువు కల్పతరువులు
సృష్టిస్థితిలయ కారణమూర్తులు
మణిద్వీపానికి మహానిధులు ॥భువ॥

21. కోటిప్రకృతుల సౌందర్యాలు
సకలవేదములు ఉపనిషత్తులు
పదార్థుంకుల పద్మశక్తులు
మణిద్వీపానికి మహానిధులు

22. దివ్యఫలములు దివ్యాస్త్రములు
దివ్యపురుషులు ధీరమాతలు
దివ్యజగములు దివ్యశక్తులు
మణిద్వీపానికి మహానిధులు

23. శ్రీ విఘ్నేశ్వర కుమారస్వాములు
జ్ఞానముక్తి ఏకాంత భవనములు
మణినిర్మితమగు మండపాలు
మణిద్వీపానికి మహానిధులు

24. పంచభూతములు యజమాన్యాలు
ప్రవాళసాలం అనేక శక్తులు
సంతానవృక్ష సముదాయాలు
మణిశ్రీ్వపానికి మహానిధులు ॥భువ॥

25. చింతామణులు నవరత్నాలు
నూరామడలు వజ్రపురాసులు
వసంతవనములు గరుడపచ్చలు
మణిద్వీపానికి మహానిధులు

26. దుఃఖము తెలియని దేవీసేనలు
నటనాట్యాలు సంగీతాలు
ధనకనకాలు పురుషార్థాలు
మణిద్వీపానికి మహానిధులు

27. పదునాల్గు లోకాలన్నిటిపైన
సర్వలోకమను లోకము గలదు
సర్వలోకమే ఈ మణిద్వీపం
స్థర్వేశ్వరి కది శాశ్వత స్థానం

28. ఎంతామణుల మందిరమందు
పంచబ్రహ్మల మంచముపైన
మహాదేవుడు భువనేశ్వరితో
నివసిస్తాడు మణిద్వీపములో ॥భువ॥

29. మణిగణఖచిత ఆభరణాలు
ఎంతామణి పరమేశ్వరిదాల్చి
సౌందర్యానికి సౌందర్యముగా
అగుపడుతుంది మణిద్వీపములో

30. పరదేవతను నిత్యముకొలిచి
మనస్ప్రంచి అర్చించినచో
అపారధనము సంపదలిచ్చి
మణిద్వీపేశ్వరి దీవిస్తుంది

31. నూతన గృహములు కట్టినవారు
మణిద్వీపవర్ణన తొమ్మిదిసార్లు
చదివిన చాలు అంతా శుభమే
అష్టసంపదల తులతూగేరు

32. శివ కవితేశ్వరి శ్రీచక్రేశ్వరి
మణిద్వీపక వర్ణన చదివినచోట
తిష్టవేసుకుని కూర్చునునంట
కోటి శుభాలను సమకూర్చుటకై

భువనేశ్వరి సంకల్పమే జనియించె మణిద్వీపం
దేవదేవుల నివాసము అదియే కైవల్యం ॥భువ॥



ఓం కాత్యాయన్యైచ విద్మహే కన్యకుమార్యైచ ధీమహి
తన్నో దుర్గిః ప్రచోదయాత్ ॥



అమ్మల గన్నయమ్మ, ముగురమ్మలమూలపుటమ్మ, చాలపె
ద్దమ్మ, సురారులమ్మకడు పాఱడిపుచ్చినయమ్మ, తన్ను లో
నమ్మిన వేల్పుటమ్మలమనమ్ముల నుండెడియమ్మ, దుర్గ, మా
యమ్మ, కృపాబ్ధి, యిచ్చుత మహత్త్వకవిత్వ పటుత్వ సంపదల్.